"వెళ్లిపోయినట్టున్నాడు. అయినా రేపు మన ఇంటికి వస్తానన్నాడు. అప్పుడు పరిచయం చేస్తాను. వాళ్ళిల్లు మన ఇంటి దగ్గరే!" అంది జయశ్రీ.

"ఇంతకీ... వినోద్ ఎవరు?" అసహనంగా ప్రశ్నించాడు మౌళి.

"బస్సులో నా ప్రక్కసీట్లో కూర్చున్నతని పేరు వినోద్. రాత్రంతా తను నిద్రపోలేదు. నన్ను నిద్రపోనివ్వలేదు" ముసిముసిగా నవ్వుతూ అంది.

"నీ ప్రక్కన కూర్చున్నది ఓ ముసలావిడ కదా..?" అనుమానంగా అడిగాడు.

"మొదట ముసలావిడే కూర్చుంది. తర్వాత తనకు ఇరుకుగా ఉందని వినోద్‌ని నా ప్రక్కకి పంపించి తను త్రీసీటర్లో కూర్చుంది."

మౌళి ఏం మాట్లాడలేదు. తన భార్య అలా పరాయి వ్యక్తి ప్రక్కన కూర్చోవడం అతనికి నచ్చలేదు. పైగా- అతని కంపెనీ ఆమె ఎంజాయ్ చేయడం ఇంకా నచ్చలేదు.

ఇల్లు చేరేంతవరకూ ఆమెతో మాట్లాడకుండా సీరియస్‌గా ఉండిపోయాడు.

●

సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన మౌళికి గులాబ్‌జామ్ స్వీటుని కప్పులో అందించింది జయశ్రీ.

"ఏమిటి విశేషం..?" అన్నాడు కప్పు అందుకుంటూ.

"ఈరోజు వినోద్ మన ఇంటికి వస్తాడని చెప్పాను... గుర్తులేదా?"

మౌళి ముఖం నల్లబడింది.

"బస్సులో పరిచయమైతే ఇంటికి పిలవడమేనా? అతనెవరో, ఎలాంటివాడో తెలుసుకోకుండా స్నేహం చేయడం అంత మంచిది కాదు."

"వినోద్ మంచివాడండీ! లేకుంటే నేను మాత్రం ఇంటికి పిలుస్తానా?" ముఖం చిన్నబుచ్చుకుంటూ అంది జయశ్రీ.

"సరే... నీ యిష్టం! నేను ఆఫీసు వరకు వెళ్లొస్తాను!" అంటూ లేచాడు మౌళి.

"అదేమిటి- ఇప్పుడేగా ఆఫీసు నుంచి వచ్చారు? పైగా- వినోద్ వస్తుంటే మీరు ఇంట్లో లేకుండా ఏం బాగుంటుంది?"

"ఏం ఫర్వాలేదు. ఇన్‌స్పెక్షన్ వస్తోంది. కొంత పని మిగిలివుంది. రమ్మని బాసు పిలిచాడు" అంటూ చెప్పులేసుకుని బయటకి నడిచాడు మౌళి.

●

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తెరిచిన జయశ్రీ- ఎదురుగా కనిపించిన మౌళిని చూసి ఆశ్చర్యపోయింది.

"అదేమిటి... ఆఫీసుకి వెళ్లలేదా..?" అని అడిగింది.

"బాసు భార్య అర్జంటుగా రమ్మని ఫోన్ చేసిందట! ఆయన వెళ్లిపోయారు. నేనొక్కడ్నే ఏం చేయాలని వచ్చేశాను. వినోద్ రాలేదా?" ఇంట్లోకి చూస్తూ అడిగాడు.

"ఇంకా రాలేదు. వచ్చే సమయం అయింది!" గోడ గడియారం వైపు చూస్తూ అంది.

